నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 2-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 161 | పేజీలు: 4 | వెల: రూ.1/-

నిర్భయదోషి వినయ్ వర్మకు చుక్కెదురు

-క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): నిర్భయ రేప్ కేసులో దోషిగా ఉన్న వినయ్ శర్మ పెట్టుకున్న క్షమాభిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించారు. వాస్తవానికి నిర్భయ రేప్ కేసులో నలుగురు దోషులకు శనివారం ఉరిశిక్ష అమలు చేయాల్సి ఉన్నది. కానీ ఆ దోషులకు ఉరిశిక్షను నిరవధికంగా వాయిదా వేశారు. డెత్‌వారెంట్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. శనివారం ఉదయం 6 గంటలకు ఉరిశిక్షను అమలు చేయాలంటూ గతంలో జారీ అయిన డెత్ వారంట్లపై స్టే విధించాలని ముగ్గురు దోషులు పవన్, వినయ్, అక్షయ్ గురువారం పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణా శుక్రవారం విచారణ చేపట్టారు. రాష్ట్రపతికి క్షమాభిక్ష కోసం వినయ్ దాఖలు చేసిన అభ్యర్థన పెండింగ్‌లో ఉన్నదని దోషుల తరఫు న్యాయవాది ఏపీ సింగ్ కోర్టుకు తెలిపారు. ఒకే కేసుకు సంబంధించి ఒకరి పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు మిగతా వారికి ఉరిశిక్ష అమలు చేయకూడదన్న నిబంధనను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఉరిశిక్ష అమలును నిరవధికంగా వాయిదా వేయాలని కోర్టును కోరారు. అయితే వినయ్వర్మ పిటిషన్ తిరస్కరణతో మళ్లీ ఉరికి సంబంధించి కొత్తగా డెత్ వారెంట్ జారీ చేయాల్సి ఉంటుంది.

పేద, మధ్యతరగతి, అన్నదాతల సంక్షేమం లక్ష్యంగా బడ్జెట్

- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు
- కేంద్ర చట్టాలు అమలు చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు
- అంత్యోదయ స్కీమ్‌కు అత్యంత ప్రాధాన్యత
- సౌరశక్తి ద్వారా పంపుసెట్ల నిర్వహణకు ప్రోత్సాహకం
- సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచేందుకు చర్యలు
- సేంద్రీయ ఉత్పత్తుల విక్రయానికి ఆన్‌లైన్ పోర్టల్
- గ్రామాల్లో ధాన్యలక్ష్మి పథకం
- పాలు, చేపల రవాణాకు కిసాన్ రైలు
- కృషి ఉడాన్ పేరుతో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి విమానాలు
- వ్యవసాయానికి 1.60 లక్షల కోట్లు
- గ్రామీణాభివృద్ధికి 1.23 లక్షల కోట్లు
- మత్స్యకారులకు సాగర్‌మిత్ర పథకం
- పీపీపీ పథకం కింద మరిన్ని ఆస్పత్రుల ఏర్పాటు
- స్వచ్ఛ భారత్‌కు రూ.12,300 కోట్లు
- మార్చి నాటికి 150 విద్యాసంస్థల్లో వృత్తి విద్యాకోర్సులు
- వైద్య రంగానికి రూ.69 వేల కోట్లు
- విద్యారంగానికి రూ. 99,300 కోట్లు కేటాయింపు
- ఇన్‌కమ్ టాక్స్ స్లాబుల్లో భారీ మార్పులు
- త్వరలో నూతన విద్యావిధానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఈ దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని ఆమోదించి రెండోసారి కూడా భారీ మెజార్టీతో బీజేపీకి అధికారాన్ని అప్పగించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో మోదీ నాయకత్వంలో ఈ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సారానికి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఇది సామాన్యుల బ్జడెట్ అని మధ్యతరగతి కలల బడ్జెట్ అని ఆమె వ్యాఖ్యానించారు. మనదేశ ఆర్థిక మూలాలు ఎంతో బలంగా ఉన్నాయని, ద్రవ్యలోటు అదుపులో ఉందని ఆమె అన్నారు. ఆర్థికమంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం నిర్మలా సీతారామన్‌కు ఇది రెండవసారి. దేశం మొత్తం భారీ అంచానాలను పెట్టుకుంది. ప్రజల ఆదాయం పెంచే దిశగా బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఇది సామాన్యుల బ్జెట్‌గా ఆమె అభివర్ణించారు. నిర్మాణాత్మక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్లున్నదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. జాతి నిర్మాణంలో అన్నివర్గాలకు చెందిన యువత, మహిళల పాత్ర కీలకమని ఆమె అన్నారు. యువతను మరింత శక్తిమంతం చేసే దిశగా

ప్రభుత్వ నిర్ణయాలుంటాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఆదాయం, కొనుగోలు శక్తి పెంచే విధంగా ఈ కేంద్రం బడ్జెట్ ఉంటుందని నిర్మల చెప్పారు. ఇకపోతే సంక్షోభంలో కూరుకుపోయిన అన్నదాతలకు కేంద్రం తీపికబురు చెప్పింది. సాగు, వ్యవసాయ రంగానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు 16 సూత్రాల కార్యాచరణ ప్రకటించింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. 6.1 కోట్ల మంది రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అందిస్తున్నామన్నారు. వ్యవసాయంలో పోటీతత్వం పెంచడమే తమ లక్ష్యమనీ.. వ్యవసాయంలో పెట్టుబడి లాభదాయకం కావాలని ఆమె పేర్కొన్నారు. కేంద్ర చట్టాలు అమలు చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఆ తరువాత ఆరోగ్యం, స్వచ్ఛత, విద్యలకు చోటు కల్పిస్తుందని ఆర్థిక మంత్రి తన బ్జడెట్ ప్రసంగంలో వెల్లడించారు.

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ఈ దేశం వేగంగా అభివృద్ధి చెందుందని చెప్పారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న 100 జిల్లాలకు ప్రయోజనం కలిగించేలా పథకాలు ప్రకటించారు. సౌరశక్తి ద్వారా పంపుసెట్ల నిర్వహణకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. కొత్తగా 15లక్షల మంది రైతులకు సోలార్ పంపులు ఇవ్వాలని నిర్ణయించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి..సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రీయ ఉత్పత్తుల విక్రయానికి ఆన్‌లైన్ పోర్టల్ రానుంది. దేశంలో 160 మిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం పెంచనున్నారు. గ్రామాల్లో ధాన్యలక్ష్మి పథకం స్వయ సహాయక బృందాలతో గ్రామాల్లో గిడ్డంగి సదుపాయం కల్పిస్తారు. ధాన్యలక్ష్మి పథకానికి ముద్ర, నాబార్డ్ సాయం తీసుకుంటారు. పాలు, చేపల రవాణాకు కిసాన్ రైలును భారతీయ రైల్వే పీపీపీ భాగస్వామ్యంతో కిసాన్ రైలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కృషి ఉడాన్ పేరుతో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి విమానాలు అందుబాటులోకి తీసుకుని వస్తారు. ఉద్యానవన ఉత్పత్తులు 311 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరాయి. ఈ020-21లో అగ్రికల్చర్ ర్గీ÷నాన్స్ లక్ష్యం రూ.15 లక్షల కోట్లు. ప్రస్తుతమున్న 58 లక్షల స్వయం సహాయక బృందాలను మరింత విస్తరిస్తాం అన్నారు. వ్యవసాయ రంగానికి రూ.2.83 లక్షల కోట్ల కేటాయింపు ఉంటుందన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ కోసం 1.23 లక్షల కోట్ల కేటాయింపు ప్రకటించారు. తత్స్యకారుల కోసం సాగర్‌మిత్ర పథకం ప్రకటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బ్జడెట్ 'అన్నదాతా సుఖీభవ' అన్నట్లు సాగింది. రైతులకు అన్ని రూపాల్లో మేలు జరిగేలే ప్రభుత్వం పలు నిర్ణయాలు ప్రకటించింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాగునీరు, అనుబంధ రంగాలకు రూ.2.83 కోట్లు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.15 లక్షల కోట్లుగా నిర్ణయించడం వల్ల రైతులకు మేలు జరగనుంది. అలాగే, రైతులకు 20 లక్షల సోలార్ పంపు సెట్ల పంపిణీ, బీడు భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు, భూసార పరిరక్షణకు సాయం, రసాయన ఎరువుల నుంచి విముక్తి కలిగించడం, గిడ్డంగుల నిర్మాణానికి నాబార్డు, పీపీపీ పద్ధతిలో సాయం అందించడం వల్ల కూడా రైతులు ప్రయోజనం పొందుతారు. ధాన్యం కొనుగోలుకు నాబార్డు ద్వారా ఎస్ఎస్ జీలకు సాయం చేయాలని నిర్ణయించారు. ఉద్యాన పంటల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించాలని, వర్షాభావ జిల్లాలకు సాగునీటి సదుపాయం కల్పనకు అదనపు నిధుల మంజూరుకు నిర్ణయం తీసుకున్నారు. 3400 సాగర మిత్రల ఏర్పాటు, కూరగాయల సరఫరాకు 'కృషి ఉడాన్ యోజన' ప్రారంభిం చనున్నారు. కోస్తా ప్రాంతాల్లోని గ్రామీణ యువతకు మత్స్య పరిశ్రమాభివృద్ధి పై మరింత సాయం చేయనున్నట్లు మం త్రి ప్రకటించారు. భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని, ద్రవ్యోల్బణాన్ని సమర్థవంతంగా అదుపు చేయగలిగామని ఆమె అన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెబుతూ ఆకాంక్షలు, ఆర్థిక ప్రగతి, ప్రజల సంరక్షణ అనే మూడు అంశాల మీదే తన బ్జడెట్ రూపొందిందని ఆమె అన్నారు. డీమ్డ్ యూనివర్సిటీ హోదాతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెరిటేజ్ అండ్ కన్జర్వేషన్ ఏర్పాటు.

స్వచ్ఛభారత్ మిషన్‌కు రూ.12,300 కోట్లు,వైద్యరంగానికి రూ.69,000 కోట్లు,జల్‌జీవన్ మిషన్‌కు రూ.3.6 లక్షల కోట్లు ప్రకటించారు. టైర్-2, టైర్-3 పట్టణాల్లో పీపీపీ పద్ధతిలో ఆసుపత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన. జన్ ఔషధి కేంద్రాలను మరింత విస్తరిస్తాం. 150 ఉన్నత విద్యా సంస్థల్లో అప్రెంటిస్‌షిప్ ప్రారంభం. అప్పుడే ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసుకొని వచ్చిన విద్యార్థులకు పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థలు ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తారు. విద్యారంగానికి రూ.99,300 కోట్లు కేటాయించారు. నైపుణ్యాల మెరుగుదలకు రూ.3,000 కోట్లు కేటాయింపు. నేషనల్ పోలీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

టీచర్లు, పారామెడికోల సంఖ్యను పెంచుతాం. జిల్లా ఆసుపత్రుల్లో వైద్యకళాశాలల ఏర్పాటు. జిల్లా ఆసుపత్రులతో మెడికల్ కాలేజీల అనుసంధానం.భారత్‌లో చదువుకునేందుకు 'ఇండ్‌సాట్' కార్యక్రమం.

మ్యూజియాలుగా పురావస్తు స్థలాల అభివృద్ధి

అయిదు పురావస్తు స్థలాలను మ్యూజియాలను మారుస్తున్నట్లు ప్రకటించారు. హర్యానాలోని రాఖీగఢీ, యూపీలోని హస్తినాపూర్, అస్సాంలోని శివ్ సాగర్, గుజరాత్‌లోని ధోలావీరా, తమిళనాడులోని ఆదిచనెల్లూరులను మ్యూజియాలుగా మారుస్తున్నట్లు ఆమె ప్రకటించారు. 2020లో జీ20 సదస్సుకు రూ.100 కోట్లను ప్రకటించారు. లఢక్ అభివృద్ధికి రూ.5958 కోట్లు, జమ్మూకశ్మీర్ కోసం రూ.38,757 కోట్లు కేటాయించారు.

బడ్జెట్ సమర్పణకు ముందు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ తదితరులు

రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌తో నిర్మల భేటీ

బడ్జెట్ ప్రకటనలకు బల్లచరిచిన ప్రధాని మోడీ
జైట్లీని తలచుకుంటూ ఆర్థికమంత్రి బడ్జె ట్ ప్రసంగం
జిఎస్టీ ఆశించిన ఫలితాలు ఇచ్చిందన్న నిర్మల

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బ్జడెట్ నేపథ్యంలో మంత్రులు నిర్మాలా సీతారామన్, అనురాగ్ ఠాగూర్ శనివారం ఉదయం ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా పార్లమెంట్‌కు బయలుదేరారు. ఉదయంమంత్రివర్గ సమావేశంలో బడ్జెటకకు ఆమోదించారు. బడ్జెట్‌కన్నా ముందు రాష్ట్రపతి రామ్‌నాథ్‌ను ఆర్థికమంత్రి కలిసారు. ఈసారి బ్జడెట్‌పై ప్రజలతో పాటు కంపెనీలు కూడా భారీగానే అంచనాలు పెట్టుకున్నాయి. పార్లమెంట్‌లో బడ్జెట్ వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత ఉత్సాహంగా కనిపించారు. లోక్‌సభలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ చదువుతున్న సమయంలో.. ప్రధాని మోదీ ఆనందంగా కనిపించారు. ప్రభుత్వ స్కీమ్‌లను మంత్రి చదువుతున్న సమయంలో మోదీ పదే పదే బల్లను చరుస్తూ కనిపించారు. చాలా హుషారుగా ఆయన తన ఉత్సాహాన్ని చూపించారు. సభలో ఉన్న బీజేపీ సభ్యులతో సమానంగా మోదీ తనలో ఉన్న ఆనందాన్ని ప్రదర్శించారు. ప్రతిపక్షాల వైపు మంత్రి నిర్మల చూస్తున్న సమయంలోనూ మోదీ తన సంతోష సంకేతాలను వ్యక్తప రిచారు. అలాగే పలువురు మంత్రులు, ఎంపిలు కూడా బడ్జెట్ ప్రసంగం చదువుతుండగా సంతోషంతో బల్లలు చరిచారు. విశేష అంచనాల మధ్య కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ పార్లమెంటులో 2020 సార్వత్రిక బ్జడెట్ ప్రవేశపెట్టారు. బ్జడెట్ ప్రసంగం సందర్భంగా మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి ఆమె ఘనంగా నివాళి అర్పించారు. వస్తు సేవా పన్ను రూపకర్త అరుణ్ జైట్లీ అంటూ కొనియాడారు. వస్తు, సేవా పన్ను (జీఎస్టీ) మన దేశ చరిత్రలో అత్యంత కీలకమైనది. దీని రూపకర్త ఇవాళ మన మధ్య లేరు. అరుణ్ జైట్లీకి నా నివాళులు...అని నిర్మల పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఏకాభిప్రాయంతో సామరస్యంగా పనిచేసే రోజు వస్తుందంటూ జైట్లీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. జీఎస్టీ కారణంగా అటు రాష్ట్రాలు గానీ, ఇటు కేంద్రాలు గానీ ఎలాంటి అధికారాలూ కోల్పోవని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడుతూ 15వ ఆర్థిక సంఘం నివేదికను నిర్మల సభ ముందుంచింది. మోదీ ప్రభుత్వానికి భారీ మెజార్టీ లభించిందన్నారు. చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజల ఆదాయాలను పెంచే దిశగా బడ్జెట్ ఉంటుందన్నారు. సంపదను సృష్టించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఒకే దేశం ఒకే పన్ను అనే నినాదంతో తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) మంచి ఫలితాలను ఇచ్చిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ వల్ల ఆదాయం పెరిగిందని ఆమె పేర్కొన్నారు. రవాణా, లాజిస్టిక్స్ రంగంలో వృద్ధి పెరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇన్స్‌పెక్టార్ రాజ్యం తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఎంతో ప్రోత్సాహం లభించిందని నిర్మలా అన్నారు. అలాగే జీఎస్టీ వల్ల వినియోగదారులకు లక్ష కోట్ల వరకు ప్రయోజనాలు చేకూరాయని నిర్మలా పేర్కొన్నారు. జీఎస్టీ గురించి చెబుతూ మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని గుర్తు చేసుకున్నారు. పన్నుల వసూలు విషయంలో ఆయన ముందు చూపుతో వ్యవహరించారని నిర్మలా గుర్తు చేశారు. ఆయన కృషి వల్లే జీఎస్టీ గొప్పగా రూపుదిద్దుకుందని తెలిపారు.

అన్నదాతా సుఖీభవ అన్న నిర్మల

రైతాంగానికి భారీగా వరాలు
వ్యవసాయాభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బడ్జెటెట్ 2020-21 ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సందర్భంగా వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు కేంద్రం పెద్ద పీట వేసింది. ఈ క్రమంలోనే ఆమె ముఖ్యంగా రైతులపై వరాల జల్లు కురిపించారు. కేంద్రం ప్రభుత్వం ఇక నుంచి రైతుల కోసం కిసాన్ రైలు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. 6.1 కోట్ల మంది రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అందిస్తున్నామన్నారు. అలాగే వర్షాభవ జిల్లాలకు అదనపు నిధులు, తీవ్ర నీటికొరత ఉన్న వంద జిల్లాలకు నిధుల కేటాయింపు, సాగునీటి సౌకర్యాలు కల్పించేలా ప్రాధాన్యం, రైతులకు 20 లక్షల సోలార్ పంపుసెట్లు, బీడు భూముల్లో సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు పెట్టుబడి సాయం చేయనున్నారు. వీటితో పాటు రైతులకు రసాయనిక ఎరువుల నుంచి విముక్తి, భూసార రక్షణకు అదనపు సాయం, సంస్కరణలు, రైతులకు సహాయంగా గోదాముల నిర్మాణం, గోదాముల నిర్మాణానికి నాబార్డు ద్వారా సాయం చేయనున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రైతుల కోసం ప్రత్యేకంగా విమాన సర్వీసుల్ని కూడా ప్రారంభిస్తామన్నారు. భారతీయ రైల్వే రైతుల కోసం కిసాన్ రైలు తయారు చేస్తుందన్నారు. 2022 లోగా ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రైతుల కోసం 16 యాక్షన్ పాయింట్స్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు వ్యవసాయానికి, వ్యవసాయ సంబంధిత పథకాలకు రూ.2.83 లక్షల కోట్లు ఈ బ్జడెట్‌లో కేటాయింపులు చేశామన్నారు. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.15 లక్షల కోట్లు కేటాయింపులు చేశామన్నారు. అలాగే సీవీ కేజ్ కల్చర్ విధానంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.

విద్యావైద్య రంగాలకు కేటాయింపులు పెంపు

కొత్త విద్యావిధానం తీసుకుని వస్తామని ప్రకటన
విద్యారంగానికి రూ. 99,300 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్జడెట్‌లో వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు కేంద్రం పెద్ద పీట వేసింది. చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేసేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రజల ఆదాయాలను పెంచే దిశగా బ్జడెట్ ఉంటుందని నిర్మలా సీతారామన్ ప్రసంగం మొదట్లో చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 99,300 కోట్లు కేటాయిస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. యువ ఇంజినీర్లకు ఉపాధి కల్పిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వైద్య రంగానికి త్వరలో కొత్త విద్యా పాలసీ తీసుకొస్తామన్నారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులు ప్రవేశపెడుతామని పేర్కొన్నారు. రూ. 3000 కోట్లు నైపుణ్యాభివృద్ధి కేటాయిస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా డిగ్రీ స్థాయిలో ఆన్‌లైన్ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు నిర్మలా సీతారామన్ తెలిపారు. త్వరలోనే కొత్త ఎడ్యుకేషన్ పాలసీ తీసుకొస్తామని మార్చి 2021 నాటికి అప్రెంటీస్షిప్ ఎంబెడెడ్ డిగ్రీ, డిఎ÷-లొమా కోర్సులు ప్రవేశపెడతామని అన్నారు. పేద విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ విద్య అందించబోతున్నామని శుభవార్త చెప్పారు. త్వరలోనే నేషనల్ పోలీస్, నేషనల్ ఫొరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయాల ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కొత్తగా సరస్వతి, సింధు యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే మరోవైపు నూతన విద్యావిధానం ద్వారా ఇక నుంచి డిగ్రీ ఆన్‌లైన్‌లోనే చదువుకునే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఈ డిగ్రీ విధానానికి మాత్రం షరతులు వర్తిస్తాయని చెప్పుకొచ్చారు. కేవలం ఈ విద్యావిధానాన్ని దేశంలో పేరుపొందిన 100 జాతీయ విద్యాలయాల్లో మాత్రమే ఈ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఇక భారత్‌లో చదువుకునే విదేశీ విద్యార్థుల కోసం 'ఇండ్‌శాట్' అనే పేరుతో నూతన విద్యా విధానం తీసుకురానున్నట్లు నిర్మలా పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లలో సానుకూల పవనాలు

బడ్జెట్ ప్రకటనతో లాభాలతో ముందుకు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న 2020 సార్వత్రిక బడ్జెట్ పై సానుకూల అంచనాలు నెలకొన్న నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లలో సందడి నెలకొంది. ట్రేడింగ్ ప్రారంభంలో కొద్ది సేపు ఊగిసలాడిన తర్వాత క్రమంగా దేశీయ మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ఆరంభంలో సెన్సెక్స్ 90.46 పాయింట్ల లాభంతో 40,813.95 వద్ద కొనసాగుతుండగా... నిఫ్టీ 22.10 పాయింట్ల లాభంతో 11984.20 వద్ద ట్రేడయ్యింది. వచ్చే ఏడాది జీడీపీ వృద్ధి రేటు 6.5 శాతానికి చేరే అవకాశం ఉందన్న అంచనాలతో పాటు ప్రస్తుత ఆర్థిక మందగమనానికి చెక్ పెట్టేలా కేంద్రం విరుగుడు చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం మార్కెట్లలో నెలకొన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మేడారం జాతరకు భారీగా ఏర్పాట్లు

-ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

ములుగు,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): తెలంగాణ కుంభమేళా మేడారం జాతరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సమ్మక్క-సారలమ్మ జాతరకు లక్షలాదిగా తరలి వచ్చే భక్తజనం కోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. భక్తులను తరలించేందుకు వివిధ ప్రాంతాల నుంచి 4 వేల ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. రెండేళ్లకు ఒకసారి వచ్చే వనదేవతల సంబరం..మేడారం జాతరకు అంతా సిద్ధం అయ్యింది. ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు వన జాతర వైభవంగా జరగనుంది. అడవి దేవతలను కొలిచే జాతర మహోత్సవానికి తెలంగాణ నుంచే కాకుండా దేశంలోని పలురాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. మూడు రోజుల వేడుకలో పాల్గొని..అమ్మవారికి పూజలు, మొక్కలు చెల్లించుకుంటారు. ఇప్పటికే మేడారానికి భక్తులు పోటెత్తుతున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకుని పూజలు చేస్తున్నారు. మేడారం జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది పోలీస్ శాఖ. అటు ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టింది. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు కలిపి మొత్తం 10 వేల మంది పోలీస్ సిబ్బందిని వినియోగించనున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి పూర్తిస్థాయిలో భద్రతా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. బందోబస్తును ఇద్దరు ఐజీలు, ఇద్దరు సీపీలు,

ఆరుగురు ఎస్పీలు, 25 మంది అడిషనల్ ఎస్పీలు, 96 మంది డీఎస్పీలు, 228 మంది సీఐలు, 731 మంది ఎస్సైలు, 70 మంది మహిళా ఎస్సైలు పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. మేడారం నుంచి ములుగు వరకు మొత్తం 330 సీసీ కెమెరాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో కదలికలను గమనించేందుకు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 20 ప్యాన్-టిల్ట్-జూమ్ కెమెరాలను వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ కెమెరాలోని నమోదయ్యే దృశ్యంలో ఒకేసారి 150 మంది కదలికలు అత్యంత స్పష్టంగా చూసే వీలుంటుందని చెప్పారు. ప్రభుత్వ ఏర్పాట్లపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేడారం జాతరకు ప్రభుత్వం కనీవినీ ఏర్పాట్లు చేసిందని మెచ్చుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సంతోషంగా వనదేవతలను దర్శించుకుంటున్నారు.

రథసప్తమిని పురస్కరించుకుని భావనపాడు బీచ్‌లో పుణ్యస్నానాలు చేసిన ప్రజలు

చరిత్రలో నేటినిజం



కం॥ పురుగుల మందులు, యితరులు
ఎరువులు వ్యవసాయ పుండు నింపిడ వనుచునే
పరమత్మ 'సుభాషు ఫాలే'
కరు'రైతుల కొనగి నాడు కమ్మనిబోధన్ !!

(ఫిబ్రవరి 2 సుభాష్ ఫాలేకర్ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

ప్రకృతిలో మానవుడు సర్వశ్రేష్ఠ జీవవైవిధ్యం!

నేటినిజం
ఆదివారం 2-2-2020

'కరోనా వైరస్' మరో విచిత్రమైన వ్యాధి. చైనాలో బయటపడిన ఈ భయంకర 'రోగ ధాతువు'– వైరస్ ప్రపంచ దేశాల ప్రజలను హడలెత్తిస్తుండడం నడుస్తున్న వ్యథ! చిత్ర విచిత్రమైన వ్యాధులు ప్రపంచ జనజీవనాన్ని ఆవహించి అతలకుతలం చేస్తుండడం దాదాపు నాలుగు దశాబ్దులుగా ఆగని వ్యథ. 'కరోనా రోగధాతు' వైపరీత్యం చైనాలోని 'ఊహాన్' నగరంలో ఒకరిని బలికొన్న కొద్దిరోజులకే చైనాలోని అనేక ప్రాంతాలకు వ్యాపించడమేకాక నేపాల్ తదితర దేశాలకు కూడ విస్తరించి పోయిందన్న ప్రచారం జరుగుతోంది. చైనాలో నూట పాతిక మందికి పైగా ఈ వ్యాధికి బలికావడం ఈ వ్యాధి వ్యాపించిపోతున్న భయంకర వేగానికి నిదర్శనం. గతంలో బయటపడిన వివిధ విచిత్ర వ్యాధులు ఇంత వేగంగా విస్తరించలేదు.

చైనాలో ప్రస్తుతం దాదాపు పదహైదువందల మందికి ఈ 'కరోనా' జబ్బు సోకిందట! చైనాలోని 'ఊహాన్'లోను ఇతర ప్రాంతాలలోను ఉన్న వందల భారతీయ విద్యార్థులను, ఇతరులను మన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్వదేశానికి తరలించుకొని రావడానికి యత్నిస్తోంది. వివిధ దేశాలనుంచి చైనాకు రాకపోకలు నిలచిపోవడం విమానయాన సేవలు రద్దుకావడం విస్తరిస్తున్న "విలయాని"కి ప్రతీక! విలయం విశ్రమించడం ఖాయం! కానీ మరో 'విలయం'ముంచుకొని రాదన్న విశ్వాసం లేదు!! దశాబ్దుల చరిత్ర ఇందుకు నిదర్శనం!

వైద్య చికిత్సల, ఔషధ రూపకల్పనల ఆధునిక ప్రామాణిక పటిమ పెరుగుతుండడం పరిణామక్రమం, చిత్ర విచిత్ర వికృత విషరోగాలు కొత్తకొత్తవి పుట్టుకొని వస్తుండడం సమాంతర విపరిణామం! జీవజాల సమాహారమైన ప్రకృతిలో మానవుడు సర్వశ్రేష్ఠ జీవవైవిధ్యం! ఈ సర్వశ్రేష్ఠత్వం మిగిలిన వైవిధ్యాల పరిరక్షణకు దోహదం చేయడం ప్రకృతిలో నిహితమైఉన్న సహజ లక్షణం! ఈ 'సర్వశ్రేష్ఠ వైవిధ్యం' ఇతర వైవిధ్యాలను పరిమార్చడం అపవాదం– ఎక్సెప్షన్–! కానీ గత వంద, రెండువందల ఏళ్లలో విశ్వవ్యాప్తంగా ఈ 'అపవాద వికృతి' ప్రకృతిని పరిమార్చడం 'విలాసం'– ఫ్యాషన్– అయిపోయింది! ప్రకృతిని పరిమార్చుతున్న మానవ జీవన విధానం భస్మాసుర ప్రవృత్తివలె విస్తరించడం గత శతాబ్ది చరిత్ర! ప్రకృతిలో జీవ వైవిధ్యం విస్తరించడానికి బదులు జీవ వైవిధ్యం క్రమంగా విచ్ఛిన్నంకావడం ఈ చరిత్ర... అనవసరంగా ఒక చెట్టును కూల్చివేయడంవల్ల వైవిధ్య విచ్ఛిత్తి... ఒక జంతువును వేటాడి వెన్నంటి చంపడం జీవవైవిధ్య విచ్ఛిత్తి!! జంతుజాలం, వృక్షజాలం పరస్పరం పరిపోషకాలు! ఈ పరిపోషకత్వం పరస్పర విధ్వంసంగా మారిపోవడం ప్రాకృతిక వైపరీత్యం. ఈ వైపరీత్యం వల్లనే ఊహించని చిత్ర విచిత్ర వ్యాధులు ఉత్పన్నవౌతున్నాయి! ప్రకృతికి అనుగుణంగా లేని మానవ జీవన 'విలాసం' ఇలాంటి వైపరీత్యాలకు కారణం అవుతున్న అభినవ భస్మాసుర స్వభావం! 'విచ్ఛిన్నం'చేస్తున్న మానవుడు భస్మాసురుని వలె భంగపడుతున్నాడు! ఈ భంగపాటునకు "ఊహాన్ వ్యాధి" మరో నిదర్శనం..

తిరుమలల వైభవంగా రథసప్తమి వేడుకలు

–సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

తిరుమల,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): తిరుమలలో రథసప్తమి వేడుకలు ఆంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి.ఈ వేడుకలలో భాగంగా శ్రీవారి సుర్యప్రభ వాహన సేవ వైభవోపేతంగా సాగింది.ఉదయం 5.30 గంటలకే మలయప్ప స్వామి సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతు భక్తులకు దర్శనమిచ్చారు..తేజో విరాజితుడైన శ్రీనివాసుడు బంగారు సూర్యప్రభ వాహనంపై తిరువీధులలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తున్నాడు.. సూర్యుడు తేజోనిధి ప్రకృతికి చైతన్య ప్రదాత సూర్యప్రభ పైన శ్రీనివాసుని దర్శనం భక్తులకు పూర్ణఫలాన్ని ఇస్తుంది..ఆరోగ్యం,ఐశ్వర్యం ఈ వాహన సేవ దర్శనం వల్ల పరిపూర్ణంగా లభిస్తుందని భక్తుల విశ్వాసం..దీంతో భారీ సంఖ్యలో భక్తులు సూర్యప్రభ వాహన సేవలో ఫాల్గొని స్వామి వారికి కర్పూర నిరాజనాలు సమర్పిస్తున్నారు.. స్వామి వారి వాహనం ఉత్తరమాడా వీధిలోని వాయువ్య దిశకు చేరుకున్న తరువాత ఇక్కడ మలయప్ప స్వామి వారి పాదాలను సూర్యకిరణాలు స్పర్శిస్తాయి.. అటుతరువాత సూర్యప్రభ వాహనంపై మలయప్ప స్వామి వారు తిరుమాఢ వీధిల్లో ఊరేగుతూ తిరిగి ఆలయం చేరుకుంటారు..అటుతరువాత చ ఉదయం 9 గంటల నుండి 10 గంటల మధ్య చిన్నశేష వాహనంపై మలయప్ప స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు..

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన విద్యాశాఖ

–టెన్త్‌లో ఉత్తమ ఫలితాల కోసం కసరత్తు

జగిత్యాల,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాలో పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచలన మేరకు కార్యాచరణకు విద్యాశాఖ కసరత్తుచేస్తోంది. ప్రిపరేటివ్ ప్రత్యేక తరగతులతో ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో గత రెండుసంవత్సరాల నుంచి పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందనీ, ఇప్పుడు కూడా అదే స్ఫూర్తి తో పనిచేసి గతంలోకంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామని డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఎంఇవోలను సమన్వయంచేస్తూ ముందకు వెళతామని అన్నారు. ఉపాధ్యాయుల్లో కొత్త, పాత అనే బేధాభిప్రాయాలు లేకుండా ఒక టీంలా ఏర్పడి విద్యార్థులను విద్యార్థిగా చూడకుండా సొంత పిల్లలుగా చూసుకుంటూ సగుతామని అన్నారు. ఇతర జిల్లాలో ఎలాంటి సౌకర్యాలు లేకున్నా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారనీ, మన జిల్లాలో ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్న చోట అసౌకర్యం కలుగకుండా విద్యావలంటీర్లను నియమించుకొని బోధన చేయిస్తున్నామన్నారు. పదోతరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత వచ్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనీ, ఉత్తీర్ణతలో తేడా వస్తే పాఠశాలలపై, సబ్జెక్టు టీచర్లపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. పదిఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి హ్యాట్రిక్ సాధించాలని కలెక్టర్ శరత్ అధికారులకు సూచించారు. పదో తరగతి విద్యార్థుల గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసారి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యచరణ అమ లు చేస్తున్నామని తెలిపారు.

ఒత్తిడికి దూరంగా పరీక్షలకు సిద్ధం కావాలి

కామారెడ్డి,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ):పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికావద్దని కలెక్టర్ సత్యనారాయణ సూచించారు. రాబోయే టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, చదువుకునే సమయంలో చక్కటి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులు తమ ఎమోషన్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవాలని సూచించారు. మైండ్‌లో నుంచి నెగిటివ్ ఆలోచనలను తీసివేయాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ల వాడకానికి దూరంగా ఉండాలని, అభ్యసనపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు.

తెలంగాణ హైకోర్టులో జగన్ పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి1 (ఆర్ఎన్ఎ) : ఈడీ కేసుల్లో వ్యక్తిగత హాజరు మినహాయింపు కోసం ఏపీ సీఎం జగన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తన బదులు సహ నిందితులు హాజరయ్యేందుకు అనుమతించాలని ఆయన కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుల్లో వ్యక్తిగత హాజరు మినహాయింపుపై నాంపల్లిలోని సీబీఐ, ఈడీ కోర్టు నిరాకరించడంతో జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

సీఎంగా ప్రతి నిమిషం రాష్ట్రాభివృద్ధికి కేటాయించాల్సి ఉన్నందున ఈడీ కేసుల్లో హాజరు మినహాయింపు ఇవ్వాలని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. ఈ కేసుల్లో సీబీఐ, ఈడీ కోర్టు పలు అంశాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ కేసుల్లో 11 ఛార్జిషీట్లు, ఈడీ కేసుల్లో 5 ఛార్జిషీట్లు సమోదయ్యాయి. వీటిపై సీబీఐ, ఈడీ కోర్టులో విచారణ జరుగుతోంది. గతంలో సీబీఐ కేసుల్లో వ్యక్తిగత హాజరు మినహాయింపుపై హైకోర్టును ఆశ్రయించిన ఆయన.. తాజాగా ఈడీ కేసుల్లో హాజరు మినహాయింపుపై ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు శుక్రవారం జరిగిన విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి జగన్‌కు సీబీఐ, ఈడీ కోర్టు మినహాయింపు ఇచ్చింది. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న ఎన్.శ్రీనివాసన్, అయోధ్య రామిరెడ్డి, ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి, విశ్రాంత అధికారులు శామ్యూల్, మన్మోహన్‌సింగ్, రాజగోపాల్, కృపానందం శుక్రవారం విచారణకు హాజరయ్యారు.

బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి1 (ఆర్ఎన్ఎ): ఆరోగ్యం , అభివృద్ధి, వాయుకాలుష్య నివారణ ప్రధాన అజెండాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేసింది. శుక్రవారం ఇక్కడ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, ప్రకాష్ జవదేకర్, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు మనోజ్ తివారీ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలపై మీడియాతో నితిన్ గడ్కరి మాట్లాడుతూ, పర్యావరణంపై ప్రధానంగా తమ పార్టీ దృష్టి పెడుతుందన్నారు. ఢిల్లీ వాసులందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని వాగ్దానం చేశారు.

ఢిల్లీ ప్రజలు వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటిని సమర్ధవంతంగా పరిష్కరించేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్తామని చెప్పారు. 16 లేన్ల హైవేతో పాటు ఢిల్లీలో మరిన్ని యూనివర్శిటీలకు నెలకొల్పుతామని అన్నారు. ఢిల్లీని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు బీజేపీ కృతనిశ్చయంతో ఉందన్నారు. సంకల్ప పత్రంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తామని, బీజేపీని గెలిపించాలని గడ్కరి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో విషాదం.. నవ వధువు ఆత్మహత్య

హైదరాబాద్,ఫిబ్రవరి1 (ఆర్ఎన్ఎ) : వనస్థలిపురంలో విషాదం చోటుచేసుకుంది. నవ వధువు పింకీ ఆత్మహత్య చేసుకుంది. నెలన్నర కిందటే పింకీకి వివాహమైంది. పెళ్లైన నెలన్నరకే నవ వధువు ప్రాణాలు తీసుకుంది. భర్త కుటుంబ సభ్యులపై మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై అన్వేషిస్తున్నారు.

మేడారం జనజాతరకు వేళాయె

హైదరాబాద్, ఫిబ్రవరి 1:రెండేళ్లకోమారు జరగే సమ్మక్క, సారలమ్మ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా మరోమారు తన ఘనతను చాటుకోనుంది. తెలంగాణ ఏర్పడ్డతరవాత ఈ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ప్రపంచ దృష్టిని ఆకర్శించేలా చేస్తున్న ఏర్పాట్లు అభినందనీయం. గిరిజనుల సంస్కృతి,సంప్రదీయాలను మన్నించి చేస్తున్న ప్రయత్నాలు అభినందీనయం. ఇటీవల నాగోబా జాతర, కొమురవెల్లి, ఐనవోలు తదితర జాతరలకు ప్రభుత్వం బాగా ప్రోత్సాహం ఇస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా నిధులు కేటాయించి ప్రజలకు భరోసా కల్పిస్తోంది. ఉత్తరాదిలో జరిగే కుంభమేళాకు తీసిపోని విధంగా ప్రజలు మేడారం ఆరాధి స్తున్నారని ప్రపంచానికి తెలియచేశారు. మేడారం సమ్మక్క–సారక్కలు తెలంగాణ ఆత్మగౌరవానికి, ధిక్కార సంస్కృతికి ప్రతీకలుగా గుర్తించాలి. గిరిజనులు తమ ఆరాధ్యదైవాలను కొలిచే జాతర. నియంతృత్వ ధిక్కారానికి, పోరాట పటిమకు నిలువెత్తు ప్రతిరూపం. ఈ మహాజాతర ఘనంగా నిర్వహించాలన్న సంకల్పాన్ని ప్రకటించారు. మేడారం వచ్చే భక్తులకు శాశ్వత ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచమే అబ్బుపడేరీతిలో మహాజాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే ఏటా జంపన్న వాగులో నీరు లేకపోవడం వల్ల లక్నవరం చెరువు నుంచి నీటిని విడుదల చేయాల్సి వస్తోంది. భక్తులు అత్యంత పవిత్రంగా జంపన్నవాగులో స్నానమాచరిస్తారు. ఆ వాగు కలుషితం కాకుండా చూడాల్సి ఉంది. మేడారం మహాజాతర నిజానికి ప్రతీ రెండేండ్లకోసారి జరుగుతుంది. కానీ భక్తులు జాతర జరిగే సమయం లోనే కాదు.. నిరంతరాయంగా వచ్చి తల్లుల దీవెనలు పొందుతున్నారు. ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడాలేనివిధంగా గిరిజన సమాజమే కాదు మిగితా సమాజం తండోప తండాలుగా వచ్చి వెళ్తుంటారు.

అందుకు అనుగుణమైన ఏర్పాట్లు చేస్తే భక్తులకు ఇబ్బందులు రావు. దాదాపు కోటిమంది వరకు జాతరకు రానుండడం సామాన్య విషయం కాదు. వివిధ ప్రాంతాల నుంచి భక్తజనులు జాతరకు ముందే పోటెత్తుతున్న తీరు చూస్తుంటే మేడారంనకు ఉన్న ప్రత్యేకత వేరుగా చెప్పనక్కరలేదు. అందుకే ఇక దీనిని ప్రపంచం అబ్బురపడేలా అభివృద్ధి చేస్తామని, జాతరకు ప్రజలంతా సహకరించాలని అందుకు అనుగుణంగా అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించారు. మొత్తంగా రానున్న రోజుల్లో తెలంగాణ జనజాతరకు ప్రపంచ గుర్తింపు దక్కడం ఖాయం. మేడారం జాతరకు జాతీయ హోదా రావాలని సిఎం కూడా కోరుకుంటున్నారు. అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటి నుంచే కృషి చేస్తూనే ఉన్నారు. కేంద్రాన్ఇనకలసి పదేపదే విన్నవిస్తూనే ఉన్నారు. ప్రజల్లో ఎంతో భక్తి విశ్వాసం ఉంటే తప్ప ఈ జాతరకు ఇంతటి ఆదరణ దక్కదు. లక్షలాదిగా ప్రజలు నెల ముందుగానే తరలివచ్చిన తీరే ఇందుకు నిదర్శనం. అన్నింటికి మించి ప్రభుత్వం ఇక్కడ చేసిన ఏర్పాట్లు అమోఘం. ముఖ్యంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్రావు, ఇంద్రకరణ్ రెడ్డి,సత్యవతి రాథోడ్‌లు ముందుండి ఏర్పాట్లను పరిశీలించి జాతర పనులను త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు. అధికార యంత్రాంగం కూడా అహోరాత్రాలు కష్టించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చేస్తోంది. ఎంతపెద్ద జాతరైనా ఘనంగా నిర్వహించగలమని ప్రభుత్వం గతంలోనే నిరూపించింది. అందుకే లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. మొక్కులు, పూజలతో మేడారం ఆధ్యాత్మిక వనమైంది. ఇక్కడికి రావడం ఎంతో గర్వంగా ఉందని అత్యధికమంది ఆనందపారవశ్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ అనుభూతి మాటల్లో చెప్పలేమంటున్నారు. చిన్నపాటి కుగ్రామంలో లక్షలాది మందికి అధికారులు సకల ఏర్పాట్లు చేయడమంటే ఒక సవాలే అయినా దానిని సక్రమంగా చేపట్టిన తీరు అభినందించకుండా ఉండలేం.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక సౌకర్యాలు అనుకున్న స్థాయిలో లేకున్నా ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికారులు తమ ప్రతిభను, చిత్తశుద్ధిని చాటుకుంటున్నారు. అధికారులు కూడా అంకితభావంతో పని చేస్తున్నారు. సిఎం కెసిఆర్ కూడా ఈ జాతర విషయంలో ముందు నుంచీ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఏర్పాట్లకు పురమాయించారు. అందుకే మరో రెండేండ్ల తర్వాత మళ్లీ జరిగే మేడారం జాతరను ప్రపంచమే అబ్బురపడేలా నిర్వహించేలా ఆసక్తి కలిగిస్తున్నారు. సమైక్య రాష్ట్రంలో సమ్మక్క సారక్క జాతరకు దక్కాల్సిన ప్రాముఖ్యం దక్కకుండా పోయిందనడంలో సందేహం లేదు. తెలంగాణ ఆత్మగౌరవానికి నిజమైన ఘన వారసత్వాన్ని అందించిన మహాతల్లుల జాతర ఏర్పాట్లకోసం అంతా అహోరాత్రులు కృషి చేస్తున్నారు. సమ్మక్క సారక్క దర్శనం కోసం వస్తున భక్తులతో ఈ నాలుగు రోజులు వనం జనసాగరాన్ని తలపించనుంది. మేడారంలో గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను దర్శించుకోవడానికి లక్షలాదిమంది తరలి రానున్నారు. భక్తితో మొక్కులు చెల్లించుకుంటారు. తెలంగాణ నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా తరలివస్తారు. వనదేవతలకు ఎత్తుబంగారం, ఒడిబియ్యంతో మొక్కులు సమర్పించి తల్లీ సల్లంగ సూడు.. రెండేళ్లకోసారి వస్తాంఅంటూ తిరుగు ప్రయాణం అవుతారు.. మొత్తంగా అద్భుతంగా జాతర కొనసాగనుంది.

వెక్కిరిస్తున్న చట్టాల్లో ఉన్న లోపాలు

నిర్భయ దోషులకు కలసి వస్తున్న కాలం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలు మరోసారి వాయిదా పడడం చూస్తుంటే చట్టంలో ఉన్న లోపాలు మరోమారు వెక్కిరించాయి. ఇప్పటి వరకు ఇలా ఉరివాయిదా పడడం ఇద రెండో సారి. తొలుత జనవరి 22న ఉరికి ఆదేశాలు ఇచ్చినా అమలు కాలేదు. అలాగే ఫిబ్రవరి 1న ఉరి తీయాల్సిఉండగా కోర్టు మరోమారు వాయిదా వేసింది. చట్టంలో ఉన్న లొసుగులను ఆధారం చేసుకుని ఉరి వాయిదా పడేయడంలో దోషులు కృతకృత్యులయ్యారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు శిక్షను అమలు చేయరాదంటూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశించింది. చట్టపరంగా తమలో కొందరికి మిగిలి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాల్సి ఉన్నందున శిక్ష అమలును నిరవధికంగా వాయిదా వేయాలంటూ దోషులు పెట్టుకున్న పిటిషన్‌పై అడిషనల్ సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా ఈ మేరకు ఆదేశాలిచ్చారు.

నిర్భయ కేసులో దోషులైన పవన్ గుప్తా, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్, ముకేశ్ కుమార్ సింగ్‌లను ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు ఉరి తీయాలంటూ కోర్టు జనవరి 17వ తేదీన ఆదేశించిన విషయం తెలిసిందే. వినయ్ క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి కోవింద్ వద్ద పెండింగ్‌లో ఉండగా, మిగతా ఇద్దరు చట్టపరమైన అవకాశాలను ఉపయోగించుకునేందుకు వీలుగా ఉరి శిక్ష అమలును వాయిదా వేయాలంటూ దోషులు పవన్, వినయ్, అక్షయ్‌ల తరఫున లాయర్ ఏపీ సింగ్ గురువారం పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం జడ్జి ధర్మేందర్ రాణా విచారణ చేపట్టారు. నలుగురిలో ఏ ఒక్కరి పిటిషన్ పెండింగ్‌లో ఉన్నా మిగతా వారిని ఉరి తీయడం నిబంధనలకు విరుద్ధమని దోషుల తరఫు న్యాయవాది వాదించారు. ఏకీభవించిన న్యాయమూర్తి డెత్ వారెంట్లను వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చారు.

మరోవైపు, నిర్భయ కేసులో మరో దోషి పవన్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నేరానికి పాల్పడిన సమయానికి మైనర్ అయినందున తనకు విధించిన ఉరిశిక్షపై సమీక్ష జరపాలంటూ అతడు పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఆఖరి అవకాశంగా సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేసే అవకాశం ఉంది.

ఇలా ఉండగా, న్యాయం దక్కే దాకా పోరాటం కొనసాగిస్తామని నిర్భయ తల్లి ఆశాదేవి మీడియాతో అన్నారు. ఉరిశిక్ష వాయిదా పడేలా దోషులు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరగాల్సి ఉందని హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మరోవైపు, హేయమైన నేరాలకు విధించిన ఉరిశిక్ష అమలుపై బాధితుల కోణంలో నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందంటూ కేంద్రం వేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. మొత్తంగా ఈ కేసు దృష్ట్యా ఇకముందు ఇలాంటి కేసుల్లో శిక్ష అమలులో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిపై ఉంది. అందుకు అనుగుణంగా చట్టాలను కఠినంగా మార్చాలి.

రాజకీయంగా మహిళలకు పెద్దపీట

మున్సిపల్ ఎన్నికల్లో భారీ విజయం
టిఆర్ఎస్ రాజకీయ ప్రోత్సాహమేకారణం
ఎమ్మెల్యే రేఖానాయక్ వెల్లడి

నిర్మల్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లోనూ మహిళలే మహరాణులుగా నిలిచారు. మరోసారి అతివలదే ఆధిపత్యం కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువ మంది కౌన్సిలర్లుగా గెలుపొందారు.. రిజర్వు స్థానాల కన్నా ఎక్కువ మంది మహిళలు కౌన్సిలర్లుగా గెలవడం మహిళలకు రాజకీయంగా సిఎం కెసిఆర్ ఇస్తున్న ప్రోత్సాహానికి నిదర్శనమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 11 పుర పాలక సంఘాల్లో మొత్తం 309వార్డులు ఉండగా.. వీటిలో 50శాతం మహిళలకు రిజర్వు చేశారు. దీంతో మొత్తం 153వార్డులను మహిళలకు రిజర్వేషన్ చేయగా.. మిగతా 156వార్డులను జనరల్ స్థానాలుగా ఉంచారు. 153వార్డుల్లో పూర్తిగా మహిళలే పోటీ చేసేందుకు అవకాశం కల్పించగా.. మిగతా జనరల్ స్థానాల్లో పురుషులతో పాటు మహిళలు కూడా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో మరోసారి మహిళలు తమ సత్తాను చాటడం తమకు గర్వకారణమని ఎమ్మెల్యే రేఖ అన్నారు.మరోవైపు జిల్లాలో రెండు చోట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు రిజర్వు చేయగా.. నాలుగు చోట్ల మహిళలు మున్సిపాలిటీ పీఠాలను దక్కించుకున్నారు. జనరల్ స్థానాల్లోనూ మహిళలకు అవకాశం కల్పించారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ జనరల్ రిజర్వు చేయగా.. టీఆర్ఎస్ నుంచి జంగంకళ (ఎస్సీ మహిళ)ను మున్సిపల్ చైర్‌పర్సన్లుగా ఎన్నుకున్నారు. బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి జనరల్ కాగా.. టీఆర్ఎస్ నుంచి జక్కుల శ్వేత (ఎస్సీ మహిళ)కు అవకాశం కల్పించారు. ఇక చెన్నూర్ మున్సిపాలిటీ జనరల్ మహిళకు కేటాయించగా.. ఇక్కడ అర్చనగిల్డా (టీఆర్ఎస్), భైంసా మున్సిపాలిటీకి బీసీ మహిళకు కేటాయించగా.. సబియాబేగం (ఎంఐఎం)చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇది మహిళల రాజకీయప విజయానికి నిదర్శనమని అన్నారు. ఇటీవల ప్రకటించిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో పురుషుల కన్నా మహిళలు ఎక్కువ మంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. రిజర్వు స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలో పురుషులకన్నా మహిళలు ఏడుగురు మంది ఎక్కువ కౌన్సిలర్లు గెలిచారు. ఉమ్మడి జిల్లాలో 158మంది మహిళలు కౌన్సిలర్లుగా గెలుపొందగా.. పురుషులు 151మంది కౌన్సిలర్లుగా గెలిచారు. వాస్తవానికి మహిళలకు 153వార్డులను రిజర్వు చేయగా.. ఐదు జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసి మహిళలు విజయం సాధించడం విశేషం. రిజర్వు స్థానాలకన్నా ఐదు స్థానాలు ఎక్కువగా గెలిచారు. జనరల్ స్థానాలు 156 ఉండగా.. 151మంది పురుషులు కౌన్సిలర్లుగా గెలిచారు. కాగజ్‌నగర్‌లో రెండు వార్డులు, మంచిర్యాల లో ఒకవార్డు, బెల్లంపల్లిలో రెండు వార్డుల్లో జనరల్ స్థానాల్లో మహిళలు పోటీ చేసి విజయం సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 12మున్సిపాలిటీలు ఉండగా.. ఇందులో మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించలేదు. ఇక్కడ 1/70యాక్టు అమలులో ఉండగా.. వివాదం కోర్టుకు చేరడంతో ప్రత్యేకాధికారి పాలనలో నడుస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 11 చోట్ల ఈ నెల 22న పోలింగ్ నిర్వహించగా 25న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 11మున్సిపాలిటీలకుగాను.. పది చోట్ల టీఆర్ఎస్ పురోభివృద్ధిని దక్కించుకోగా.. ఒక్క భైంసాను మాత్రమే ఎంఐఎం కైవసం చేసుకుంది. ఓటర్లలోనే కాదు.. పోలింగ్‌లోనూ తామే ముందున్నామని నిరూపించారని ఆమె అన్నారు. ఉమ్మడి జిల్లాలో పురుషుల కన్నా మహిళలు ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. నిర్మల్, ఖానాపూర్, ఆదిలాబాద్, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలో పురుషులకన్నా మహిళలు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాల, నస్పూర్, క్యాతన్‌పల్లి, భైంసా మున్సిపాలిటీల్లో మహిళల కన్నా పురుషులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో పురుషుల కన్నా మహిళలు ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. తాజాగా వచ్చిన ఫలితాల్లోనూ వారిదే పైచేయి కొనసాగిందని మహిళగా ఇది తనకు గర్వంగా ఉందని రేఖానాయక్ అన్నారు. సిఎం కెసిఆర్ ఇచ్చిన

మేడారంలో కొనసాగుతున్న రద్దీ

-భారీగా తరలివస్తోన్న జనాలు

ములుగు,ఫిబ్రవరి1(నేటినిజం ప్రతినిధి): ఆదివాసీ గిరిజన దైవాలు మేడారం సమ్మక్క-సారక్క దీవెనలు పొందేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. అమ్మవార్ల నామస్మరణతో తల్లుల గద్దెల ప్రాంగణం మార్మోగుతున్నది. మేడారం జనప్రవాహంగా మారుతున్నది. వనం జనంతో నిండిపోతున్నది. మహాజాతరకు గడువు సమీపిస్తున్న కొద్దీ భక్తుల రద్దీ పెరుగుతున్నది. లక్షల మంది మేడారంలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. గత జాతరతో పోలిస్తే ఈ జాతర సమయంలో ముందస్తు మొక్కులు చెల్లించేందుకు కుటుంబాల సమేతంగా వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నది. జంపన్నవాగు భక్తుల రాకతో జలకళతో దర్శనమిచ్చింది. లక్నవరం సరస్సు నుంచి జంపన్నవాగుకు విడుదల చేసిన నీరు మేడారంలోని జంట వంతెనలను ముద్దాడింది. భక్తులు అందులో స్నానాలు చేశారు. కల్యాణకట్టలో తలనీలాలు ఇచ్చారు. కాలినడకన తల్లుల గద్దెల ప్రాంతానికి చేరుకున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలైన్ ద్వారా భక్తులను అనుమతించారు. భక్తులు అమ్మవార్ల గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు పార్కింగ్‌లోకి వాహనాలను మళ్లించారు. ప్రధాన ద్వారం వద్ద వీఐపీలకు మాత్రమే దర్శనానికి అనుమతిచ్చారు. జంపన్నవాగులో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు ఇచ్చారు. గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క-సారక్క, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, చీరె, సారె, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం ప్రతీ వీధి భక్తులతో కిటకిటలాడింది.

మొక్కలు నాటి జీవ జాతుల్ని కాపాడుకుందాం..

జయశంకర్ భూపాలపల్లి , ఫిబ్రవరి1: గ్రీన్ ఇండియా చాలెంజ్ లో భాగంగా భూపాలపల్లి జిల్లా ఏరియా ఆస్పత్రి జనరల్ మేనేజర్ నిరీక్షణ్ రాజ్ విసిరిన గ్రీన్ ఛాలెంజ్ స్వీకరించిన డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ పద్మజ ఆస్పత్రి ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో పది కోట్ల మొక్కల్ని నాటి హరిత తెలంగాణ చేయాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే నాలుగు కోట్ల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా గత కొద్ది రోజులుగా భూమి పై విపరీతమైన ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. అడవులు తగ్గి, జంతువులు జనసంచారం చేస్తున్నాయన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల జంతువులు, పక్షులు చాలా ఇబ్బంది పడుతున్నాయనీ, వాటిలో చాలా మటుకు మృత్యువాత పడుతున్నాయని ఆమె తెలిపారు. దీంతో ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నట్టు డాక్టర్ పద్మజ ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంతో పాటు, జంతువులు తిరిగి అడవుల్లోకి వెళ్లి పోయేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని ఆమె అన్నారు. కాబట్టి, ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మరో ముగ్గురికి గ్రీన్ ఛాలెంజ్ విసిరారు. వారిలో బసవయ్య జీఎం పర్సనల్ కార్పొరేట్ , కుమార్ రెడ్డి జీఎం సెక్యూరిటీ, సల్మాన్ డిజిఎం పర్సనల్ ఉన్నారు.

తుక్కుగూడలో కెకె ఓటు చెల్లదు

టీఆర్ఎస్ ఎంపీ కేశవరావుపై ఉప రాష్ట్రపతికి ఫిర్యాదు

ఆయనపై చర్య తీసుకోవాలని లక్ష్మణ్ వినతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. ఎన్నికల అధికారులు, పోలీసులు టీఆర్ఎస్ నేతలు చెప్పినట్టు నడుచుకున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు నిబంధనలకు విరుద్ధంగా తుక్కుగూడ మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు వేశారని చెప్పారు. సాంకేతికంగా ఆయన ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.తుక్కుగూడలో ఎంపీ కేశవరావు ఓటు చెల్లదని లక్ష్మణ్ అన్నారు. ఈమేరకు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆయన ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదును రాజ్యసభ ఎథిక్స్ కమిటీకి పంపించి చర్యలు తీసుకోవాలని కోరినట్టు లక్ష్మణ్ తెలిపారు. ఉప రాష్ట్రపతిని కలిసినవారిలో ఎంపీలు బండి సంజయ్, అరవింద్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు,ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

సంపద సృష్టికర్తలను గౌరవించాలి

పాత,కొత్తల కలయికే ఆర్థిక సర్వే

ముఖ్య ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): సంపద సృష్టికర్తలను గౌరవించాలి... వారు సంపదను సృష్టించకపోతే.. సంపదను పంచలేం..అని ముఖ్య ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్ అన్నారు. ఆర్థిక సర్వేపై ఆయన స్పందిస్తూ, 'ఆరు నెలల్లో ప్రవేశపెడుతున్న రెండో ఆర్థిక సర్వే ఇది. ఈసారి సర్వే థీమ్ వెల్త్ క్రియేషన్. ఆగస్టు15న ప్రధాని సంపద సృష్టిపై మాట్లాడారు. ఆర్థిక సర్వే కవర్‌ను రూ.100 నోటు పై నుంచి తీసుకొన్న ఊదారంగును వాడాం. పాత కొత్తల ఆలోచన కలయికే ఈ ఆర్థిక సర్వే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించడంతో.. భారత ఆర్థిక వ్యవస్థ కూడా మందగించింది. నాన్-ఫుడ్ క్రెడిట్ విభాగంలోని కార్పొరేట్ రుణాలు 2013లో అత్యధికంగా ఉన్నాయి.. ఆ తర్వాత బాగా తగ్గాయి. పెట్టుబడులు తగ్గాయి. ఇది జీడీపీపై ప్రభావం చూపింది' అని సీఈఏ సుబ్రమణియన్ అన్నారు. ఆర్థిక సర్వేను విలేకర్లకు వివరించారు. ఈ సందర్భంగా పలు ఇన్ఫోగ్రాఫ్స్‌ను ప్రదర్శించారు. ప్రజల వినిమయం తగ్గడం, ఎన్‌బీఎఫ్‌సీలు ఒత్తిడికి గురికావడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం, తక్కువ పన్ను ఆదాయాలు వంటి వాటికి అత్యవసర చికిత్స అవసరమని అభిప్రాయపడ్డారు. సంపద సృష్టికర్తల నుంచి ప్రతి ఒక్కరు లబ్దిపొందారని రుజువైందని తెలిపారు. ఒక పెద్ద సంస్థ పద్దులు బాగోకపోతే.. దాని ప్రభావం మిగిలిన వాటిపై కూడా పడుతుందన్నారు. చైనాలో కార్మికులు ఎక్కువగా అవసరమైన రంగాలు ఉన్నాయి.. భారత్‌లో కూడా అలాంటి రంగాల అవసరం ఉందన్నారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు లేకపోతే మనం సామాజిక కార్యక్రమాలపై రెట్టింపు మొత్తాన్నివెచ్చించే వారమని చెప్పారు. మనం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే మార్కెట్లోని పరోక్షశక్తులను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకొన్న వ్యాపార అనుకూలంగా ఉన్నాయనే విషయాన్ని స్టాక్ మార్కెట్లు వెల్లడిస్తున్నాయి.

ఢిల్లీ చేరుకున్న ప్రత్యేక విమానం

కారోనా భయంతో వూహాన్ నుంచి విద్యార్థుల రాక

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): చైనాలో కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో అక్కడ ఉన్న భారతీయులను ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తీసుకుని వచ్చారు. ఈ వ్యాధి క్షణాల్లో వ్యాపించి, ప్రాణాలను హరిస్తోంది. చైనాలో ఉన్న వివిధ దేశాల పౌరులను చైనాప్రభుత్వం ఆయా దేశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసింది. ఉదయం 7.30 గంటలకు చైనాలోని వుహాన్ నగరం నుంచి 324 మంది భారతీయులు ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. వీరిలో అత్యధికంగా విద్యార్థులే ఉండడం గమనార్హం. ప్రస్తుతం విమానాశ్రయంలో వారికి వైద్యబృందం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తోంది. చైనా నుంచి భారత్‌కు చేరుకున్న భారతీయులను పర్యవేక్షణలో ఉంచేందుకు ఢిల్లీ సమీపంలోని పనేసర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా చైనా నుంచి వచ్చిన భారతీయులు వైద్య బృందానికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, చైనా నుంచి భారత్‌కు వచ్చేందుకు సిద్ధమైన మరో ఆరుగురు భారతీయుల్ని ఎయిర్‌పోర్టు సిబ్బంది అడ్డుకున్నారు. వారిలో కరోనా వైరస్ లక్షణాలు ఉన్నట్లు సమాచారం.

సహకార ఎన్నికలపై అధికార పార్టీ దృష్టి

ఉమ్మడి జిల్లాకు కలిపి ఎన్నికల నిర్వహణ

నిజామాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఫలితాల ఊపులో ఉన్న అధికార టిఆర్ఎస్ ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార సం ఘాలకు సిద్ధం అవుతోంది. ఎన్నికల నగారా మోగడంతో ఇక వాటిపై దృష్టి సారించింది. ఒక్కొక్కటిగా అన్ని ఎన్నికలు నిర్వ హిస్తూ వస్తున్న ప్రభుత్వం .. ఇక మిగిలి ఉన్న సహకార ఎన్నికలను కూడా పూర్తి చేయనుంది.సహకార ఎన్నికలు ఉమ్మడి జిల్లాకు జరగనున్నాయి. డీసీసీబీ విభజన జరగనందున ఈ ఎన్నికలు రెండు జిల్లాలకు కలిపి నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 142 సహ కార సంఘాలుండగా.. ఇందులో నిజామాబాద్ జిలాలో 89 ఉన్నాయి. మరో మూడు సంఘాలు జిల్లాలో పెంచాల్సింది. బాల్కొండ, చందూరు, నిజామాబాద్ నార్త్ (అర్సపల్లి)లో మూడు సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతి పాదనలు పంపారు. వీటిపై ఇంకా స్పష్టత రాకముందే ఎన్నికల నగారా మోగడంతో ఈ నిర్ణయాన్ని విరమించుకున్నారు. మొత్తం ఓటర్లు 1.16 లక్షల మంది ఉన్నారు. 2013లో సహకార ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరి నెలలో పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. ఆరు నెలలు పాటు మొత్తం నాలుగు సార్లు కాలపరిమితిని ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఫిబ్రవరి 10 వరకు చివరగా పొడిగించిన గడువు ముగు స్తుంది. కాగా.. ఈ నెల 15న ఎన్నికలు ముగిసి చైర్మన్‌ను ఎన్నుకొనే వరకు ప్రస్తుతం ఉన్న డీసీసీబీ చైర్మన్ పదవిలో కొనసాగనున్నారు. ప్రతి పీఏసీఎస్‌కు 13 సెగ్మెంట్లుగా విభజిస్తారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సిఎం కెసిఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 15 రోజుల వ్యవధిలో మొత్తం ఎన్నికల పక్రియను పూర్తి చేసేలా షెడ్యూల్‌ను రూపొందించారు. ఫిబ్రవరి 3న సొసైటీల వారీగా జిల్లా సహకార అధికారి నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఈ నెల 5 నుంచి 7 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 8న నామినేషన్ల స్క్రూటి నీ ఉండగా.. 9న ఉపసంహరణ ఉంటుంది. 15న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. పార్టీల గుర్తులేకుండా బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు జరుగుతాయి. 16న అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఫలితాలు వెలువడిన మూడు రోజుల్లో డీసీసీబీ చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు 23 మంది ఆఫీసు బేరర్ల ఎన్ని కను నిర్వహిస్తారు. ఇందులో పది ఓసీ, బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీ చొప్పున తీసుకొని ఆ మేరకు ఏ పీఏసీఎస్‌లో ఎవరి ఓట్లు ఎక్కువగా ఉంటాయో వారికి రిజర్వేషన్‌ను కేటా యిస్తారు. ఈ రిజర్వేషన్ల ఆధారంగా పీఏసీఎస్ చైర్మన్ కోసం పోటీ చేస్తారు. పార్టీ రహిత ఎన్నిక కావడంతో గుర్తులు కేటాయిస్తారు. బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నిక నిర్వహి స్తారు. మెజార్టీగా గెలిచిన చైర్మన్లు డీసీసీబీ చైర్మన్‌ను చేతి ఎత్తే పద్ధతిలో ఎన్నుకుంటారు. జిల్లా ఆఫీసు బేరర్లను కూడా పీఏసీఎస్ చైర్మన్లు ఎన్నుకుంటారు. మొత్తం 23 మంది డీసీసీబీ డైరెక్టర్ల ఎన్నిక ఉంటుంది. ఇందులో సొసైటీ సంఘాల ద్వారా ఎన్నికైనవారు 18 మంది ఉండగా.. మరో ఐదుగురు మత్స్యకార, ఇతర సంఘాల నుంచి డైరెక్టర్లు కోసం పోటీ చేస్తారు. 18 మంది ఏ క్లాస్‌గా, ఐదుగురిని బీ క్లాస్‌గా పరిగణిస్తారు. ఇం దులోనూ రిజర్వేషన్లు ఉంటాయి. పదిశాతం ఓసీ, బీసీ, రెండు శాతం ఎస్సీ, ఒక శాతం ఎస్టీలకు కేటాయిస్తారు. వీరిని పీఏసీఎస్‌లు ఎన్నుకోవాల్సి ఉంటుంది. కాగా.. ఇప్పటికే పలుమార్లు కొత్త సభ్యుల నమోదు కోసం దరఖాస్తుకు అవకాశం కల్పించారు. అదనంగా ఐదారువేల మంది వరకు కొత్తగా నమోదు చేసుకున్నా.. 2018 డిసెంబర్ 31 వరకు నమోదై ఉన్నవారికి మాత్రమే ఈ ఎన్నికల్లో ఓటు వేసే వీలుంది.

వ్యక్తిగత మరుగదొడ్ల లక్ష్యాన్ని చేరుకోవాలి

గ్రామాలు స్వచ్ఛంగా ఉండేలా చూడాలి

మెదక్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పలు గ్రామాలలో పెండింగులో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా మండలాల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని పనిచేయాలని కలెక్టర్ ధర్మారెడ్డి అన్నారు.

జిల్లాలోని అన్ని గ్రామాల్లో పెండింగులో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించడానికి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. చెత్తను కాల్చి వేయడం వల్ల కలిగే అనర్థాలను వారికి తెలియజేయాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలోని మహిళా సంఘాలను సంఘటితం చేసి వారికి తడి, పొడి చెత్తను వేరుచేసే విధానాలపై అవగాహన పెంపొందించాలన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఇంకుడుగుంతలు ని ర్మించాలని బోరుబావుల రిచార్జి పనులపై రైతులకు అ వగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ భవనాల వద్ద ఇంకుడుగుంతలలోకి వర్షం నీరు వెల్లేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో హరితహారం, జలశక్తి అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని మండలాల ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం, జలశక్తి అభియాన్ కార్యక్రమాల విజయవంతం కోసం కృషి చే యాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

20 గ్రామపంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ..

జమ్మికుంటలో గ్రామాల పరిశుద్ధ్యానికి సంబంధించి ట్రాక్టర్లను పంపిణీ చేసిన మంత్రి ఈటెల రాజేందర్

ఎన్నికల వరకే రాజకీయాలు
ఆ తరవాత అభివృద్ధ కార్యక్రమాలు
విజేతలు ప్రజల మనసు గెలవాలి
పక్షపాతం లేకుండా పనులు చేపట్టాలి
పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో మంత్రి ఈటల

కరీంనగర్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఓట్ల వరకు మాత్రమే రాజకీయాలు ఉండాలి తప్ప తనకు ఓటు వేయలేదని చూడకూడదని మంత్రి ఈటల రాజేందర్ హితవుచెప్పారు. ఎన్నికల తరవాత అభివృద్ధి నినాదంగా

ముందుకు సాగాలన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ నూతన కార్యవర్గానికి పక్షపాతం లేకుండా ప్రజలందరి సమస్యలు పరిస్కరించాలని సూచించారు. మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా తక్కలపల్లి రాజేశ్వరరావు వదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి ఈటల.. తొలుత హుజూంరాబాద్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. గెలవడం అనేది ఒక అదృష్టం అన్నారు. ప్రజల ఆశీర్వాదంతోనే గెలిచామని పేర్కొన్నారు. అయితే గెలిచిన అభ్యర్థులు కొందరే ప్రజల మనసులో స్థానం సంపాదించుకుంటారని, ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పుకొచ్చారు. పాత పాలక వర్గానికి హుజూరాబాద్, జమ్మిక ంట రెండు పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దడానికి ఎంతో డబ్బులు వెచ్చించామని, ఆ విధంగానే అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. జమ్మికుంట ప్రజలకు త్రాగునీరు ఇచ్చిన ఘటన టీఆర్ఎస్‌దే అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక హుజూరాబాద్‌కు రూ.50, జమ్మికుంటకు రూ.40 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. తన మంత్రి పదవి ముగుస్తుందనగా హుజూరాబాద్‌కు రూ.40 కోట్లు, జమ్మికుంటకు రూ.40 కోట్లు ఇచ్చానని తెలిపారు.

ఆ డబ్బులు ఇంకా మిగిలే ఉన్నాయన్నారు. సపాయి కార్మికుల కోసం హుజూరాబాద్, జమ్మికుంట రెండు మున్సిపాలిటీల్లో డబ్బులు తెచ్చి డిపాజిట్ చేయించిన ఘనత తమదేనని పేర్కొన్నారు. ప్రజలకు వచ్చిన సమస్యను పరిష్కరించే విధంగా పాలక వర్గం ఉండాలని మంత్రి ఈటల రాజేందర్ దిశానిర్దేశర చేశారు. పందుల సమస్య, రోడ్ల సమస్య, త్రాగునీరు సమస్యలు అన్ని తీర్చే బాధ్యత మున్సిపల్ పాలకవర్గానిదేనని స్పష్టం చేశారు. పేద కుటుంబంలో పుట్టిన ప్రతిబిడ్డకు నాణ్యమైన విద్య అందిచేలా జమ్మికుంట పట్టణంలో త్వరలో విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఈటల తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో విద్య, వైద్యం కొరత లేకుండా చూస్తామన్నారు. ఏదైనా సరే తీసుకువచ్చే బాధ్యత తనదని, దానిని ప్రజలకు చేరవేసే బాధ్యత పాలక వర్గానిదని మంత్రి పేర్కొన్నారు. హుజురాబాద్, జమ్మికుంట రెండు నగరాలను హైదరాబాద్, సికింద్రాబాద్ లాగా అభివృద్ధి చేసే బాధ్యత తనది అన్నారు. గ్రూపు రాజకీయాలు, వ్యత్యాసాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా పని చేయాలని ఇరు మున్సిపాలిటీల పాలకవర్గాన్ని మంత్రి ఈటల రాజేందర్ కోరారు.

ట్రాక్టర్ల పంపిణీ

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్.. జమ్మికుంట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 20 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంలో అద్భుతమైన ఫలితాలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి ప్లలె పరిశుభ్రంగా ఉండాలన్నదే ప్రభుత్వ అక్షమని అన్నారు. రెండు విడుతలుగా నిర్వహించిన ప్లలెప్రగతి కార్యక్రమం చాలా మంచి ఫలితాలిచ్చింది. ప్లలె ప్రగతి కార్యక్రమంలో భాగంగా.. గ్రామాల్లో లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. పారిశుద్ధ్యంపై గవర్నమెంట్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు, చెత్తా చెదారాన్ని తొలగించేందుకు ప్రభుత్వం ప్రతి గ్రామానికి ట్రాక్టర్ పంపిణీ చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ ట్రాక్టర్లను గ్రామ అవసరాలకు మాత్రమే వాడాలనీ, వ్యక్తిగత అవసరాలకు వాడినట్లు తెలిస్తే, చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, ప్రభుత్వ మాజీ విప్ ఆరేపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో ఆటో డ్రైవర్ వేధింపులు

అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ప్రేమించమని.. ఇంటర్ విద్యార్థినిని వేధిసున్న ఆటో డ్రైవర్‌ను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. బీజేఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ వెంకన్న(20).. అదే ప్రాంతంలో నివాసం ఉండే ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని ప్రేమించుమని వేధిస్తున్నాడు. అయితే ఆమె అతని ప్రేమను తిరస్కరించడంతో.. ఇంకా ఎక్కువ వేధిస్తున్నాడు. తనను వివాహం చేసుకోకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో విద్యార్థిని విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించారు.

33 వేలకే ఐఫోన్ అంటూ ప్రకటన

22వేలకు విద్యార్థికి టోకరా

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేవలం రూ.33 వేలకే ఐ ఫోన్ విక్రయిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన ఇచ్చిన సైబర్ నేరగాళ్లు .. ఓ డిగ్రీ విద్యార్థికి రూ. 22 వేలు టోకరా వేశారు. సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన బాధితుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఐ ఫోన్ ప్రకటన చూసి, అవతలి వ్యక్తితో చాటింగ్‌లో మాట్లాడాడు. తమకు ఐ ఫోన్లు హోల్‌సెల్‌గా కంపెనీ నుంచి నేరుగా వస్తాయని, అందుకే తక్కువ ధరకు ఇస్తున్నామంటూ సైబర్ నేరగాడు తెలిపాడు. అది నిజమేనని బాధితుడు నమ్మాడు. మొదటిగా రూ. 22 వేలు డిపాజిట్ చేయాలని, మిగతావి ఫోన్ రీసివ్ చేసుకున్న తరువాత చేస్తే సరిపోతుందంటూ నమ్మించాడు. నీ కోసమే సెల్‌ఫోన్ పార్సిల్ పంపిస్తున్నానంటూ ఓ వీడియోను పంపించాడు. అది నిజమేనని నమ్మిన బాధితుడు డబ్బును అతడు సూచించిన ఖాతాలో డిపాజిట్ చేశాడు. ఆ తరువాత సైబర్‌నేరగాడు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గుర్తించిన విద్యార్థి.. సీసీఎస్ ఏసీపీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దంటూ పోలీసులు వారికి సూచించారు.

అరసవల్లికి పోటెత్తిన భక్తులు-రథసప్తమితో ప్రత్యేక కార్యక్రమాలు

శ్రీకాకుళం,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లికి భక్తులు పోటెత్తారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి నిజస్వరూప దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో స్వామి వారికి మహాక్షీరాభిషేకం చేశారు. వీఐపీ, సర్వదర్శనం క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులు ఇంద్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారిని దర్శించుకునేందుకు సిద్ధమయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పిల్లలతో వచ్చిన భక్తులకు ఉచితంగా పాలను అందజేస్తున్నారు.

వృద్ధి రేటు 6- 6.5శాతం : ఆర్థిక సర్వే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): దేశ వృద్ధి రేటు రానున్న ఆర్థిక సంవత్సరం (2020-21)కు 6 -6.5శాతం నమోదవుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. పార్లమెంట్ బ్జడెట్ సమావేశాలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. 2025 సంవత్సారానికల్లా దేశం నిర్దేశిరచుకున్న5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సర్వేపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను రేపు శనివారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. శనివారం ఆర్థిక మంత్రి కేంద్ర బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ఆర్థిక సర్వే హేతుబద్ధ పరిష్కార మార్గాలు సూచిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలకు సంబంధించిన స్థితిగతులను తెలుసుకోవడంలో ఆర్థిక సర్వే కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలంటే తయారీ రంగాన్ని

ప్రోత్సహించాలని సర్వే అభిప్రాయపడింది. తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తే దేశంలో ఉద్యోగ కల్పనసాధ్యమవుతుందని తెలిపింది.

ఢిల్లీలో సీఎం కేజీవ్రాల్ రోడ్ షోలు..

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి1 (ఆర్ఎన్ఎ): ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు హోరాహోరీగా ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. రాజౌరీ గా÷-డ్గ÷న్, మంగోల్ పురి, బాదర్పూర్, కస్తూర్బానగర్, జంగ్ పుర ప్రాంతాల్లో ఆప్ అభ్యర్థులతో కలిసి

అటవీ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

హైదరాబాద్ ఫిబ్రవరి1: శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఉగ్యోగులకు క్రీడలు ఎంతో ఊరటనిస్తాయని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. దుండిగల్ ఫారెస్ట్ అకాడమీ మైదానంలో అటవీ ఉద్యోగుల 5వ రాష్ట్ర స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-2020 ను మంత్రి నేడు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నిత్యం విధుల నిర్వాహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడలు ఎంతో ఊరటనిస్తాయని అన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగన్తులు చక్కటి పనితీరును కనరబర్చడానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సమన్వయం ఏర్పడి, స్నేహాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆరు రిజియన్ల నుండి గతంలో ఎన్నడూలేనంతగా 800 మంది క్రీడాకారులు ఈ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఫారెస్ట్ బీట్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల నియామకం తర్వాత క్రీడాకారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. క్రీడల్లో అటవీశాఖ అధికారులు, ఉద్యోగులను ప్రోత్సహించడానికి, వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయాడానికి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ ని ఘనంగా నిర్వహిస్తున్న పిసిసిఎఫ్ ఆర్. శోభ, ఇతర అధికారులను ఈ సందర్భంగా అభినందించారు.

ఈ ఏడాది మార్చి లో భువనేశ్వర్ లో జరగనున్న 25వ ఆల్ ఇండియా ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్ లో తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని మెడల్స్ వచ్చేలా క్రీడాకారులు తమ ప్రతిభని కనబరచాలని అకాక్షించారు. మరోవైపు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు సీఎం కేసీఆర్ క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీయం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిధులను కేటాయిస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అడవుల సరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధన్యతనిస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పచ్చదనం పెరగడంతో పాటు వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలను నాటి సంరక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, పీసీసీఎఫ్ ఆర్. శోభ, అటవీ అభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ రఘువీర్, పీసీసీఎఫ్ అడ్మిన్, ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ మునీంద్రా, అదనపు పీసీసీఎఫ్ లు దొబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, లోకేష్ జైస్వాల్, ఎం.సీ పర్గెయిన్, రిటైర్డ్ పీసీసీఎఫ్ యం. పృథ్వీరాజు, ఫారెస్ట్ అకాడమీ సలహాదారు తిరుపతయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మేడారానికి పర్యాటకశాఖ ప్రత్యేక బస్సులు

సర్వీసులను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్
యాత్రి నివాస్ నుంచి మేడారంకు బస్సులు

హైదరాబాద్,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లేందుకు హైదరాబాద్ నగరవాసుల సౌకర్యార్థం తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. జాతర ముగిసే వరకు నడిచే ఈ ప్రత్యేక బస్సులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ శనివారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయం వద్ద ప్రత్యేక పూజలు అనంతరం జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజలు మేడారం వెళ్లేందుకు అన్ని సౌకర్యాలతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. పర్యాటక ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ యాత్రి నివాస్ నుంచి మేడారంకు బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా బస్సు యాత్ర హైదరాబాద్-మేడారం-హైదరాబాద్ ఒక్కరోజు ప్యాకేజీ టూర్ కు వోల్వో కోచ్ కు 1500 పెద్దలకు, 1200

మేడారం జాతర కోసం ఏర్పాటు చేసిన టూరిజం బస్సులను హైదరాబాద్‌లో ప్రారంభించిన మంత్రి శ్రీనివాస గౌడ్

సర్వీసుల సంఖ్యను పెంచుతామన్నారు. ఏసీ బస్సుల్లో పెద్దలకు రూ.1,500, చిన్న పిల్లలకు రూ.1,200, నాన్ ఏసీ బస్సుల్లో పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.800 ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు వివరించారు. మేడారం జాతరకు వెళ్లేందుకు హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యాటక రంగం పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ లో ఉన్న చారిత్రక, పురావస్తు సంపద ను నిర్లక్ష్యం చేసి టూరిజం అంటే బీచ్ లను చూపించారని ఇప్పుడు పరిస్థితి మారిందని అన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కాళేశ్వరం టూర్ ప్యాకేజీ కి విశేష స్పందన లభించిందన్నారు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న సోమశిల నుండి శ్రీశైలం వరకు క్రూజ్ టూర్ కు పర్యాటకుల నుండి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క సారాలమ్మల మహాజాతర కు హైదరాబాద్ నుండి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతర ప్రత్యేక ప్యాకేజీ పిల్లలకు, నాన్ ఏసీ హైటెక్ కోచ్ కు రూ.1000 పెద్దలకు, రూ.800 పిల్లలకు టారిఫ్ ను నిర్ణయించామన్నారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కోసం మేడారం కు ప్రత్యేక టూర్ లో భాగంగా హెలికాప్టర్ సర్వీస్‌ను ప్రారంభించ దానికి పరిశ్రమల, ఎఱ శాఖల మంత్రి ఐఱ రామారావు తో చర్చించి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ భూపతి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, టూరిజం అధికారులు అంజిరెడ్డి, నేత్ర, రాజలింగం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌కు చేరిన బడ్జెట్ కాపీలు

జాగిలాలతో బస్తాల పరిశీలన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర కేబినెట్ సమావేశం ప్రారంభం కానున్న 2020-21 ఆర్థిక బ్జడెట్‌ను మంత్రవర్గం ఆమోదించింది. ఉదయం 11 గంటలకు బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేపెట్టారు. లోక్ సభలో రెండో సారి పద్దను నిర్మలా ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా పద్దుపై వేతన జీవులు గంపెడాశలు పెట్టుకున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆర్థిక శాఖ మంత్రి కలిశారు. బడ్జెట్ కాపీలు పార్లమెంట్‌కు చేరుకున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. కాపీలను జాగిలాలతో తనిఖీ చేయించారు. ఎలాంటి పేలుడు పదార్థాలు ఉన్నాయన్న సందేహం తీర్చుకునేందుకు ఇలా చేస్తార్లు.

ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలి: డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పాపారావు

హైదరాబాద్, ఫిబ్రవరి1: రహదారి భద్రత నియమాలను పాటించి ప్రమాదరహిత ప్రయాణాలను కొనసాగించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.పాపారావు అన్నారు. 31వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసారాంబాగ్‌లోని ఈస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ వి.సుభాష్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు, ఆర్టీఏ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతియేటా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈస్ట్‌జోన్ ఆర్టీఓ వి.సుభాష్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు ప్రజల సురక్షిత ప్రయాణాలకోసమేనన్న విషయాన్ని వాహనచోదకులు గుర్తెరగాలని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది సుమారు 60 మంది రక్తదానం చేయగా, సేకరించిన రక్తాన్ని రాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు(ఆర్‌సీటీ) రక్తనిది కేంద్రానికి అప్పగించారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఆర్టీఓ కిరణ్‌కుమార్ ఏఓ డి.ప్రదీప్ రామకృష్ణ, ఏఎంవీఐలు జె.రజనీ, ఎల్.చిన్నబాలు(బాలు నాయక్), జూనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, హెడ్ ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ సాయిబాబా, ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

2024 కల్లా మరో 100 విమానాశ్రయాల అభివృద్ధి

గ్రామాలను ఇంటర్‌నెట్‌తో అనుసంధానం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): నూతన ఆవిష్కరణలు నూతన ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్పక్రటించారు. 2024కు మరో 100 విమానాశ్రయాల అభివృద్ధి. సదీతీరాల్లో ఆర్థికాభివృద్ధి. ఐవోటీ, కృత్రిమ మేధ. ఎనలటిక్స్ కోసం నూతన విధానం. ప్రతి గ్రామ పంచాయతీకి భారత్‌నెట్‌తో అనుసంధానం వంటికార్యక్రమాలను ప్రకటించారు. రైలు మార్గాల ఇరు పక్కల సోలార్ కేంద్రాల ఏర్పాటు. పర్యాటక కేంద్రాలతో తేజస్ రైళ్లు వంటివి ప్రకటించారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే. 2వేల కి.మీ. హైవేల నిర్మాణమే లక్ష్యం. బెంగళూరుకు రూ.18,600 కోట్లతో మెట్రో తరహా సబర్బన్ రైల్వే వ్యవస్థ. కేంద్రం 20 శాతం, అదనపు నిధుల ద్వారా 60 శాతం సమీకరణ. రైలు మార్గాల ఇరు పక్కల సోలార్ కేంద్రాల ఏర్పాటు. పర్యాటక కేంద్రాలతో తేజస్ రైళ్లు. 11వేల కిలోమీటర్ల మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ. ముంబయి-అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు నడుపనున్నట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి పెట్టుబడులు అవసరం. సెల్‌ఫోన్లు, సెమీ కండక్టర్లు, వైద్య పరికరాల ఉత్పత్తి ప్రోత్సాహానికి ఒక నూతన పథకం. ప్రతి జిల్లాను ఎగుమతి కేంద్రంగా మారుస్తాం. జాతీయ మౌలిక సదుపాయాల్లో భాగంగా రూ.1.03 లక్షల కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. జాతీయ జౌళి సాంకేతికత మిషన్ ద్వారా కొత్త పథకం. చిన్న తరహా ఎగుమతిదారులకు రక్షణగా నిర్విక్ పేరుతో బీమా పథకం తీసుకుని రానున్నట్లు తెలిపారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహం. నైపుణ్య శిక్షణకు రూ.3వేల కోట్లు. యువ పారిశ్రామికవేత్తలకు అనేక ప్రోత్సాహకాలు. నేషనల్ టెక్స్‌టైల్ మిషన్‌కు రూ.1480కోట్లు. జాతీయ జౌళి సాంకేతికత మిషన్ ద్వారా కొత్త పథకం. చిన్న తరహా ఎగుమతిదారులకు రక్షణగా నిర్విక్ పేరుతో బీమా పథకం. ప్రతి జిల్లాను ఒక ఎక్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించాలనేది ప్రధాని ఆలోచన. అంతర్జాతీయ వాణిజ్య ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రత్యేక మండళ్లు ఏర్పాటు వంటి వివరాలు ప్రకటించారు.

జీవన మార్పులతో వచ్చే రోగాల నివారణ

త్వరలోనే నూతన పథకం అమలు
ఆరోగ్య రంగానికి రూ.69 వేల కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): ఆరోగ్య రంగానికి రూ.69 వేల కోట్లు కేటాయింపును ఇస్తూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. జల్ జీవన్ మిషన్‌కు రూ.3.06లక్షల కోట్లు ప్రకటించారు.

స్వచ్ఛ భారత్‌కు రూ.12,300 కోట్లు. జీవన మార్పులతో వచ్చే రోగాల నివారణకు నూతన పథకం. జీవ ఔషధి కేంద్రాల విస్తరణకు చర్యలు. ఆరోగ్య రంగంపై మరింత దృష్టి. మిషన్ ఇంద్రధనుష్ పథకం విస్తరణ. 2025కల్లా క్షయ నిర్మూలన. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రతి జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. సాగర్ మిత్ర పథకంలో గ్రామీణ యువ రైతులకు మత్స్య పెంపకంలో ప్రోత్సాహం ఇస్తామన్నారు. కేంద్ర, రాష్ట్రాలు కలిసి ఉద్యాన పంటలకు అదనపు నిధుల కేటాయింపులు, ఉద్యాన పంటల కోసం ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు. మత్స్య సంపదను పెంపొందించేందుకు చర్యలు. సాగర్ మిత్ర పథకంలో గ్రామీణ యువ రైతులకు మత్స్య పెంపకంలో ప్రోత్సాహం. పేదరికం నిర్మూలనకు స్వయం సహాయక సంఘాల చేయూత. మత్స్య సంపద ఎగుమతుల లక్ష్యం 200 లక్షల టన్నులుగా నిరదేశించారు. మూడు లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నాం అని అన్నారు. న్యూఇండియా ,సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ ,ప్రజా సంక్షేమం అన్నారు. ఇకపోతే దేశంలో డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అందరికీ ఆవాసం. ఇప్పటివరకూ 40 కోట్ల మంది జీఎస్టీ రిటర్న్‌లు దాఖలు చేశారు.

నిర్మాణాత్మక చర్యలతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ముందడుగు వేస్తున్నాం. కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే దేశం వేగంగా ముందుకెళ్తుంది. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ ఈ ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి నేరుగా నిరుపేదలకు అందించేందుకు ప్రయత్నం.

ఏప్రిల్ నుంచి పన్ను చెల్లింపులు మరింత సరళతరం కానున్నాయని అన్నారు. ఇన్‌స్పెక్టర్ రాజ్‌కు కాలం చెల్లింది. ఇందులో భాగంగా అనేక చెక్‌పోస్టులు తొలగించాం. దాదాపు 10శాతం పన్ను భారం తగ్గింది. గత రెండేళ్లలో 16 లక్షల పన్ను చెల్లింపుదారులు కొత్తగా చేరారు. ఏప్రిల్ 2020 నుంచి పన్ను చెల్లింపులు మరింత సరళతరం అవుతాయన్నారు.

రూ.5లక్షల ఆదాయం వరకు పన్ను లేదు

మార్పులతో రూ.40వేల కోట్ల ఆదాయానికి గండి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): దాయపన్ను చెల్లింపుదారులకు ఊరట కలిగించేలా బ్జడెట్- 2020-21 లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మధ్య, ఎగువ మధ్య తరగతి వారికి ఊరటనిచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పుల కారణంగా కేంద్రం రూ.40వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోనుంది. 2020-2021 కేంద్ర బడ్జెట్‌ను శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదాయపు పన్నుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశారు. ఆదాయపన్ను శ్లాబ్‌ల్లో మార్పులు చేస్తున్నట్టు తెలిపారు. కొత్త శ్లాబ్‌ల ప్రకారం..రూ.5 లక్షల నుంచి రూ.7.5లక్షల వరకు రూ.10 శాతం పన్ను విధించారు. రూ.7.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు 15శాతం, రూ.10లక్షల నుంచి రూ.12.5లక్షల వరకు 20శాతం పన్ను, రూ.12.5 లక్షల నుంచి రూ.15లక్షల వరకు 25 శాతం, రూ.15లక్షలకు పైగా వేతనం పొందే వారు 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. రూ.0 నుంచి రూ.5లక్షల వరకు ఎలాంటి పన్ను లేదు.కొత్త ఆదాయ పన్ను విధానం ఐచ్ఛికం అని తెలిపారు. మినహాయింపులు పొందాలా? వద్దా? అన్నది వేతన జీవుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. రూ.5లక్షల నుంచి రూ7.5లక్షల వరకు 20శాతం,రూ..7.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు 20 శాతం, రూ.10లక్షల నుంచి రూ.12.5 లక్షల వరకు 30శాతం,రూ.12.5లక్షల నుంచి రూ.15లక్షల వరకు 30శాతం, రూ.15లక్షల కంటే ఎక్కువ ఆదాయం పొందే వారు 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉండేది.

ఎల్ఐసీ వాటాల విక్రయం

ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ వాటాల విక్రయానికి నిర్ణయించినట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. ఎల్ఐసీని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు తీసుకుని రానున్నట్లు వెల్లడించారు. బ్యాంకుల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరగాలి. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులకు మరిన్ని ప్రోత్సాహకాలు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.3.5 లక్షల కోట్లు మూలధన సాయం అందించనున్నారు. ఐడీబీఐ బ్యాంకుల్లో వాటాల విక్రయానికి నిర్ణయించారు. బ్యాంకు డిపాజిట్లపై బీమా రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులను కాపాడుతామని,పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి వేధింపులు ఉండవన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని, పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం

-వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్ తమకు నిరాశ కలిగించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి అన్నారు. వ్యవసాయంపై ఆధారపడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్ నిరుపయోగమని ఆయన పెదవి విరిచారు. బ్జడెట్ ప్రసంగం అనంతరం ఆయన శనివారం పార్లమెంట్ ఆవరణలో వైసీపీ ఎంపీలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ద్రవ్యోల్బణం పెరగడం మంచి పరిణామం కాదు.

బ్జడెట్‌లో కొన్ని అనుకూల, ప్రతికూల అంశాలు ఉన్నాయి. డిపాజిటర్ల బీమ లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచడం మంచి పరిణామం. వ్యవసాయ కేటాయింపుల్లో ఏపీకి రావాల్సిన వాటాను కచ్చితంగా ఇవ్వాలి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారు.

ఆ విధానంలో స్పష్టత లేదు. పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన నిధులు కేటాయించాలి. అలాగే రాష్ట్రానికి, వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలి. నిధుల కేటాయింపుల్లో ఏపీకి కేంద్రం మొండి చేయి చూపించింది. పక్షపాత ధోరణితో రాష్ట్రాన్ని వివపక్షతతో చూడటం మంచిది కాదు. ఏపీలో వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపులు లేవు. ఏపీకి ఒక్క రైల్వే ప్రాజెక్ట్ కూడా ఇవ్వలేదు. ప్రత్యేక హోదాతో పాటు కీలక అంశాలను ప్రస్తావించలేదు' అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు

ఇద్దరు వ్యక్తులు మృతి

రంగారెడ్డి,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): శంషాబాద్ ఓటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన కారు.. ఆగి ఉన్న ఓ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. భాదితుల వివరాలు తెలుసుకొని, వారి కుటుంబాలకు సమాచారం అందించారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగివున్న లారీని ఢీకొన్న కారు

తిరువళ్లూరు సూత్రాల ప్రస్తావన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): బడ్జెట్ ప్రసంగంలో తిరువళ్లూరు చెప్పిన అయిదు రత్నాలను ప్రస్తావించిన నిర్మలా సీతారామన్ దేశ భద్రత ప్రథమ కర్తవ్యం అన్నారు. తిరువళ్లూరు చెప్పిన అయిదు రత్నాలు... రోగ రహితం, సంపద ఉండటం, మంచి వంటలు, ఆనందం, భద్రత. ఈ ఆశయాలకు అనుగుణంగా ఆయుష్మాన్ భారత్, రైతుల ఆదాయం రెట్టింపు, ఆనందమయ జీవితం, సంపద సృష్టికర్తలపై గౌరవం, దేశ భద్రత అంశాల్లో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. మోడీ నేతృత్వంలో ఇవన్నీ సాధించామన్నారు.

నిర్మలా సీతారామన్...రెండు అరుదైన రికార్డులు

రెండో సారి బడ్జెట్ ప్రవేశపెట్టడం..సుదీర్ఘ ప్రసంగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి1(ఆర్ఎన్ఎ): దేశం ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొంటున్న సమయంలో కేంద్రం ప్రవేశపెట్టే ఆర్థిక పద్దులపై దేశ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ బడ్జెట్‌లో తమకెలాంటి ఉపశమన చర్యలు ప్రకటిస్తారోనన్న ఉత్కంఠతో దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్నవేళ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వాలు ఏటా ప్రవేశపెట్టే బ్జడెట్‌లో ప్రాధాన్యతలతో పాటు ప్రసంగం నిడివి కూడా మారుతూ వస్తుంది. పార్లమెంట్‌లో మంత్రులు చేసే ఈ బ్జడెట్ ప్రసంగాలే ఆయా ప్రభుత్వ విధానాలకు అద్దంపడతాయి. అందువల్ల ఈ బ్జడెట్ ప్రసంగాలపై ప్రజలకు ఎంతో ఆసక్తి. స్వాతంత్ర్యానంతరం మన పార్లమెంట్‌లో ఆర్థికమంత్రులు ప్రవేశపెట్టిన బ్జడెట్ ప్రసంగాల్లో కాలం మారుతున్న కొద్దీ ఎంతో వైవిధ్యం కనబడుతుంది. ఈ నేపథ్యంలో రెండోసారి బ్జడెట్ ప్రవేశపెట్టిన మహిళగా రికార్డు సృష్టించిన నిర్మలాసీతారామన్.. ఈసారి 2 గంటల 39 నిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగాన్ని చదివి మరో రికార్డును లిఖించారు. లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రులు ఎంతసేపు ప్రసంగించారో ఓసారి పరిశీలిస్తే.. స్వాతంత్ర్యానంతరం 1947 నవంబర్ 27న పార్లమెంట్‌లో తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆర్‌కే షణ్ముఖం చెట్టిది. దేశ నిర్మాణమే లక్ష్యంగా ఆనాడు జాతి నిర్మాతలు రూపొందించిన ఆ బ్జడెట్ నిడివి 39 పేరాలు. ఆ తర్వాత వచ్చే బ్జడెట్‌ల నిడివి క్రమంగా పెరుగుతూ వచ్చింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 1991 సమయంలో కేంద్ర ఆర్థికమంత్రిగా పనిచేశారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆయువు పట్టుగా నిలిచిన ఈ కీలక సమయంలో ఆయనబడ్జెట్‌ప్రసంగం నిడివి 18,650 పదాలు. ఆ సమయంలో ఆయన చదివిన బ్జడెట్ ప్రసంగం నిడివే పెద్దది. వాజ్‌పేయీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ఆర్థికమంత్రిగా పనిచేసిన జశ్వంత్ సింగ్ 2003లో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆయన ప్రసంగం 2 గంటల 13 నిమిషాల పాటు సాగింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గతంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన సమయంలో పార్లమెంట్‌లో ఎనిమిది సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పేరాలు, పదాలు విషయంలో అరుణ్ జైట్లీ తర్వాత రికార్డు ఈయనదే. ఆయన బ్జడెట్ ప్రసంగాల్లో సగటున 202 పేరాలు ఉన్నాయి. 2012లో ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగం నిడివి 220 పేరాలు ఉండగా.. చివరి బడ్జెట్ కూడా దాదాపు అంతే. కేంద్ర ఆర్థికమంత్రిగా పి. చిదంబరం తొమ్మిది సార్లు బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. ఆయన ప్రసంగంలో సగటున 173 పేరాలు ఉన్నాయి. అత్యధిక సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టిన మంత్రుల్లో మొరార్జీ దేశాయ్ తర్వాతి స్థానం చిదంబరానిదే. 2018లో ఐదోసారి తన బ్జడెట్‌ను ప్రవేశపెట్టిన అరుణ్ జైట్లీబడ్జెట్ ప్రసంగం 109 నిమిషాల పాటు కొనసాగింది. ఆ బ్జడెట్ ప్రసంగంలో 18,604 పదాలతో కూడిన బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు. అధిక పేరాలతో ఉన్న బడ్జెట్ ప్రసంగం చదివిన మంత్రిగా ఆయన రికార్డు సృష్టించారు. 2014లో 253 పేరాల తన తొలి బడ్జెట్ ప్రసంగాన్ని 2గంటల 10 నిమిషాలు (అనారోగ్య కారణం